
మానవ జాతికి మేలిమి మలుపునిచ్చిన మహా మనీషి

ప్రవక్త ఇబ్రాహీమ్ (عليه السلام)

రచన

సయ్యిద్ అబ్దుస్సలాం ఉమరీ



మానవ జాతికి మేలిమి మలుపునిచ్చిన మహా మనీషి

ప్రవక్త ఇబ్రాహీమ్ (عليه السلام)

ఒకసారి బట్టలు మాసిపోతే మనిషి ఎక్కడ కూర్చోడాన్కి అయినా సిద్ధ పడతాడు. అలాగే ఒకసారి నడత చెడిందంటే ఎలాంటి పనులు చేయడానికైనా సందేహించడు మనిషి.

ప్రవక్తలు చెప్పిన గొప్ప సూక్తి – నీకు సిగ్గు లేదా, నీకు తోచింది చేసుకో! (బుఖారీ)

Prabodhanam printing press

అనంత కరుణామయుడు అపార దయానిధి అయిన అల్లాహ్ పేరుతో

ముందు మాట

కర్రి మబ్బుల కరాళ నృత్యానికి విసుగు చెందిన మానవాళికి ఆయనో ఉదయ కిరణం. అసత్య అంధకారాలను రూపు మాపి వెలుగుల్ని నింపిన ధర్మతేజం ఆయన. మార్గభ్రష్టత్వంలో మ్రగ్గే మానవ హృదయాలను ప్రక్షాళనం గావించి, రుజుమార్గం ఇదని తెలియజేసిన ఆశాజ్యోతి ఆయన. చైతన్యాన్ని జ్వలింపజేసే సత్తువ, మనస్సులను కదిలించే ప్రేరణ, హృదయాల్ని ఏలే శక్తి ఒక్క త్యాగానకి మాత్రమే ఉందనడానికి ఆయన నడక, నడవడిక ప్రబల తార్కాణం.

యుగయుగాలుగా నిద్రాణంలో ఉన్న ప్రజల్లోని ప్రతిభాపాటవాలను చైతన్య పరచి సత్యమార్గంలో నడిపించిన అపురూప రథసారథులందరికీ మూల పురుషుడు ఆయన. తన అస్తిత్వం రీత్యా ఆయన ఒక మనిషి మాత్రమే. కాని తన అసాధారణ త్యాగాల దృష్ట్యా, ఘనకార్యాల రీత్యా ఆయన ఒక సమాజం. ఓ గొప్ప అకాడమి! ఈ కారణంగానే ప్రవక్తల పితామహునిగా నేటికీ అటు యూద క్రైస్తవులు, ఇటు ముస్లిం సముదాయం హృదయాలలో సమానంగా చిరస్మరణీయులయ్యారు. ఈ ఘనతా విశిష్ఠతల మూలంగానే అల్లాహ్ ఇలా సెల విచ్చాడు:

"ఇది ఇబ్రాహీం (అ) జీవన ధర్మం. శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీమ్ పాటించిన జీవన సరళి పట్ల వైముఖ్యం చూపగలడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్నుకున్నాము. పరలోకంలో కూడా అతను సజ్జనుల సరసన ఉంటాడు".

(దివ్య ఖుర్ఆన్ - బఖర: 130)

అట్టి మహాత్ముని సుచరిత సంఘటనల సమాహారమే ఈ చిరు పుస్తకం. ఆదరిస్తారన్న, ఆచరిస్తారన్న నమ్మకంతో....

సయ్యిద్ అబ్దుస్సలాం ఉమరీ

విషయ సూచిక



సామాజిక జీవనానికి జీవనాడి త్యాగం

త్యాగం సామాజిక జీవనానికి జీవనాడి. సమాజం సజావుగా సాగాలంటే సభ్యుల్లో త్యాగశీలం అనివార్యం. త్యాగం – తనువులో చూపాలి. మనసులో చూపాలి. ధనంలో చూపాలి. సమయంలో చూపాలి. శక్తిలో చూపాలి. త్యాగం తన కోసం చెయ్యాలి. తనవారి కోసం చేయాలి. పరాయి వారి కోసమూ చెయ్యాలి. త్యాగం – ఆశయాల కోసం చెయ్యాలి. ఆదర్శాల కోసం చెయ్యాలి. తత్సమయ లక్ష్యాల కోసం చెయ్యాలి. చిరకాల సాఫల్యాల కోసం చెయ్యాలి. తాత్కాలిక గమ్యాల కోసం, శాశ్వత మార్గాల కోసం – జీవితమంతా త్యాగాల తోరణాలు నిండితే అందులో పండు వెన్నెల పండుతుంది. గుండెనిండా నెమ్మది నిండుతుంది. అందుకే సమాజం త్యాగాలను కోరుతుంది.

త్యాగం లేనిదే సమాజంలో అనురాగమూ లేదు, అనురక్తీ లేదు. మనుగడలో మమతలు పెరగాలంటే ప్రతి వ్యక్తీ ఎదుటివారి కోసం ఏదో ఒకటి త్యాగం చెయ్యవలసి వస్తుంది – కోరికల్ని త్యాగం చెయ్యవలసి వస్తుంది. కాంక్షల్నీ త్యజించవలసి వస్తుంది. మనసయిన మార్గాలనూ వదులు కోవలసి వస్తుంది. త్యాగం లేనిదే ఏ ఆశయమూ సిద్ధించదు. ఆశయం ఎంత ఉన్నతమైనదో త్యాగాలూ అంతే విస్తృతమయి ఉంటాయి. ఆశయం ఎంత పవిత్రమయిందో త్యాగాలు అంతే నిష్ఠను, చిత్తశుద్ధిని కోరుతాయి. త్యాగానికే తలమానికం అయిన ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వారి జీవితాన్ని అందరి కోసం ఆదర్శంగా పేర్కొంటూ అల్లాహ్ ఇలా అంటున్నాడు:

"ఒక వ్యక్తి అల్లాహ్ ముందు తల వంచి, సదాచారసంపన్నుడై ఉండి, ఏకాగ్రతచిత్తుడై ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరిస్తే – ధర్మం రీత్యా అతనికంటే ఉత్తముడు మరెవడు కాగలడు? ఇబ్రాహీమ్(అ)ను అల్లాహ్ తన మిత్రునిగా చేసుకున్నాడు".

(దివ్య ఖుర్ఆన్ - అన్నిసా: 125)

ఈ ఎంపిక ఏ ఆధారంగా జరిగింది?

"నిన్ను నీవు (నాకు) సమర్పించుకో" అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా 'సకల లోకాల ప్రభువుకు నన్ను నేను సమర్పించుకుంటున్నాను' అని అతను సమాధానమిచ్చాడు. (బఖర: 131)

"జ్ఞాపకం చేసుకోండి! ఇబ్రాహీమ్ (అ)ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని ఉద్దేశించి- "నేను నిన్ను ప్రజలకి నాయకునిగా చేస్తున్నాను" అన్నాడు.

(దివ్య ఖుర్ఆన్ - బఖర: 124)

ఆయన తీసుకొచ్చిన జీవన ధర్మం ఏది?

"ఇబ్రాహీమ్ (అ) యూదుడూ కాదు. క్రైస్త వుడూ కాదు. ఆయన ఒకే దేవుని వైపు అభి ముఖుడైన ముస్లిం-విధేయుడు. ఆయన బహుదైవారాధకులలోని వాడు ఎంత మాత్రం కాదు". (ఆలి ఇమ్రాన్:67)

ఆయన ప్రజలను యూదత్వం వైపునకో, క్రైస్తవం వైపునకో, ఆహ్వానించ లేదు. ఆ మాట కొస్తే ఈ మతాల ఉనికే అప్పటికి లేదు. ఆయన ప్రబోధించింది తౌహీద్- అల్లాహ్ మాత్రమే నిజ ఆరాధ్యుడు. దాసుడు దేవుని ఆదేశాలకు శిరసావహించడం అనే నిజం గురించే ఆయన నొక్కి వక్కాణించారు తప్పద్వైత్వమో, అద్వైత్వమో, త్రైత్వత్త్వం, విశిష్టాద్వైత్త్వం, త్రిత్త్వం మరే తత్త్వం, ఇజం గురించో కాదు. ఆ విధేయతా మార్గమే, ఆ శాంతి బాటయే ఇస్లాం. ఆ విష యానికొస్తే ప్రవక్తలందరి ధర్మం కూడా ఇస్లామే. వారందరూ ముస్లిములే. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కొరకు నిర్ధా రించాడు. దానినే (ఓ ముహమ్మద్-స!) నీ వైపునకు (వహీ ద్వారా) పంపాము. దాని గురించే ఇబ్రాహీమ్‌కు, మూసాకు ఈసా (అ)కు కూడా తాకీదు చేశాము. ఈ ధర్మాన్నే నెలకొల్పాలని, అందులో చీలిక తీసుకురావద్దనీ (వారికి) ఉపదేశించాము". (షూరా:13)

ఇదే విషయాన్ని ప్రవక్త మహనీయులు (స) వారు ఇలా ఉద్బోధించారు: **"ప్రవక్తల సమూహం సవితి సంతానం వంటిది. వారి తల్లులు (ధర్మ శాస్త్రాలు) వేరు, కాని వారి ధర్మం మాత్రం ఒక్కటే". (బుఖారి)**



ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) జీవితంలో మనకు లభించే కొన్ని పాఠాలు

1) ధర్మం వారసత్వంగా వస్తుందా?

ధనం, ఐశ్వర్యం, పొలం వారసత్వంగా లభించవచ్చేమోగానీ, ఇస్లాం మాత్రం వారస త్వంగా లభించేది కాదు. దేవుని కృపా కటాక్షాలతోపాటు దాన్ని మనిషి అన్వేషించి, శోధించి సాధించుకోవాలి. అధిక శాతం మంది ప్రవక్తలు అవిశ్వాసుల ఇంట, బహు దైవారాధనా సమాజంలోనే జన్మించారు. అలా జన్మించిన వారిలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఒకరు. ఆయన తత్వం వేరు. ప్రతి విషయాన్ని నిశిత దృష్టితో తరచి చూడటం ఆయనకు అల వాటు. మనిషి స్వహస్తాలతో చేసిన ప్రతిమల ముందు వంగటం, సూర్యచంద్ర నక్షత్రాల ముందు మోకరిల్లడం, అల్పాతి అల్ప ప్రాణు లకి అలౌకికానందంతో హారతులు పట్టడం, భక్తిపారవశ్యాలతో చేతులు జోడించి నిలబడటం ఆయనకు మింగుడుపడలేదు. తన మీద వాలే ఈగను సయితం తోలుకొలేని విగ్రహాల ముందు రకరకాల నైవేద్యాలతో మొక్కు బడులు, ముడుపులు చెల్లించుకోవడం ఆయన కు హాస్యాస్పదంగా తోచింది. మనిషి మృగమై, అక్షరాలా అధర్మం నాలుగు పాదాలా నర్తించ డం ఆయనకు సహించలేదు. అగ్ర వర్ణం, అధమ వర్ణం, పంచమ వర్ణం అంటూ అంటరానితనం, అస్పృతలనే విష గుళికల్ని జన ప్రవంతిలో చల్లి, దళిత ప్రజల శ్రమను సొమ్ము చేసుకుంటూ, వారి శ్రమను సంపదగా మార్చుకుంటూ, వారిని అన్ని విధాలా అణిచి వేయడం, అది గ్రహించలేని స్థితిలో తమ జాతి ప్రజలు ఉండటం ఆయనకు నచ్చలేదు.

రాజ్యాధికారులు తమని తాము దైవాంశ సంభూతులుగా ప్రకటించుకొని, ప్రజలందరూ తమకే తలవంచేలా చట్టాన్ని సవరించుకొని నియంతృ త్వాన్ని, నిరంకుశత్వాన్ని కొనసాగిం చడం ఆయనకు జీర్ణం కాలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే తన తండ్రి లాంటి అనేకులు పీఠాధిపతులుగా చెలామణి అవుతూ సమా జాన్ని రోగగ్రస్తం చేయడం ఆయనకు బొత్తిగా నచ్చలేదు. మనిషి మూఢ నమ్మకాల గాఢాంధకార లోయల్లో పడి లేవలేని, కాంతికి కళ్ళు తెరవలేని స్థితిలో ఉండటం గమనించిన ఆయన చలించిపోయారు. వీటన్నింటి కారణాలు, కారకాలు ఏమిటి? అని ఆలోచించారు. సత్ శోధన చేశారు, సత్యాన్వేషణ జరిపారు. అసలు సత్యాన్ని చేరుకున్నారు. స్వీక రించారు. అమలు పర్చారు. ఉద్యమించారు. అదే ప్రజలకు బోధించారు. తన జీవిక కోసం తోడ్పడే సూర్యచంద్ర నక్షత్రాల్ని కాక, తన లాంటి మనుషుల్ని కాక, తన స్వహస్తాలతో చేసిన ప్రతిమల్ని కాక, వాటన్నింటి సృష్టికర్త ముందు తల వంచడమే వీటన్నింటికీ ఏకైక పరిష్కారంగా ఆయన తలిచారు.

ప్రజలను సృష్టితాల దాస్యం నుండి విడిపించి సృష్టికర్త దాస్యంలో ఓలలాడేలా చెయ్యాలనుకున్నారు. ఆ మార్గంలోనే ఆయన అహర్నిశలు పరి శ్రమించారు కూడా. దీన్ని బట్టి అర్థమయ్యేది ఏమిటంటే- మనం ముస్లింల ఇంట పుట్టామా, క్రైస్తవుల ఇంట పుట్టామా, యూదుల ఇంట పుట్టామా, హిందువుల ఇంట పుట్టామా అన్నది ఇక్కడ చర్చనీయాంశం కాదు. ఎందుకంటే పుట్టుక -మరణాలు మన చేతిలో లేవు కాబట్టి. కాకపోతే ఈ రెండింటికి మధ్యనున్న జీవిత కాలం ఎలా జీవించాలి? విధేయులుగా జీవించాలా? అవిధేయులుగా జీవించాలా? విశ్వాస ఉత్తమ స్థితిలో మరణించాలా? అవిశ్వాస స్థితిలో కళ్ళు మూయాలా – ఇది మాత్రం మనమే నిర్ణయించుకోవాలి. ఒకవేళ మనం అవిశ్వాసుల ఇంట జన్మించి ఉంటే అది మన తప్పు కాదు. అందుకు మనము ఖేద పడాల్సి అవసరమూ లేదు. అయితే అవిశ్వాసులుగానే మరణించటం, సత్యం ఇదని తెలిసి కూడా మారకపోవడం ఖచ్చితంగా మన తప్పే అవుతుంది. తర్వాత తీరిగ్గా కూర్చోని చింతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

అలాగే ఒకవేళ మనం విశ్వాసుల ఇంట జన్మించి ఉంటే ఉబ్బితబ్బిబ్బవడమూ సముచితం కాదు. ఎందుకంటే ప్రవక్తలంతటి పుణ్య పురుషుల, పరిశుద్ధ వ్యక్తుల కడుపు పుట్టిన వారు సయితం తమ వెకిలి చేష్టల, వెర్రి పోకడల వల్ల నరకవాసుల జాబితాల్లో చేరిపోయారు. కాబట్టి ఎక్కడ పుట్టామన్నది కాదు ముఖ్యం, సత్య మార్గంలో జీవించామా అన్నది ముఖ్యం. ఇదే విషయాన్ని ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) మరియు ప్రవక్త యాకూబ్ (అ) తన సంతానానికి బోధించారు.

"ఈ ఉపదేశమే ఇబ్రాహీమ్ మరియు యాకూబ్ తమ సంతానానికి చేశారు. వారిలా అన్నారు: "నా బిడ్డలారా! అల్లాహ్ మీ కోసం ఈ (శాంతి విధేయతల) ధర్మాన్నే ఇష్ట పడ్డాడు. కనుక మీరు ముస్లిములుగా తప్ప మరణించకూడదు సుమా! (మీకు విశ్వాసస్థితిలోనే మరణం రావాలి సుమా!)". (బఖర: 132)



౨) దేవుని కటాక్షంతోనే సన్మార్గ భాగ్యం

అవును, మనిషిలో సత్యార్తి రగలాలి. మనిషి సత్యాన్వేషిగా మారాలి. అజ్ఞానం, దీనత్వం, భావ దారిద్ర్య సంకెళ్ళను తెంచే జ్ఞానవంతుడిగా, విజ్ఞానవంతుడిగా, ధీరుడిగా, శూరుడిగా ఎదగాలి. అప్పుడే మనిషిలోని ప్రజ్ఞాపాటవాలు వెలుగు చూస్తాయి. అప్పుడే దైవ కటాక్షం తోడై సన్మార్గ భాగ్యం లభిస్తుంది. మనిషి జీవిత లక్ష్యం సిద్ధిస్తుంది. ఈ సృష్టి, సృష్టిలోని సమస్తమూ అల్లాహ్‌దే. చూసేందుకు, చర్మచక్షువులతో పాటు ఆత్మ చక్షువులుండాలేగాని కానవచ్చే కథలెన్నో! వినవచ్చే పాఠాలు, గుణపాఠాలు ఎన్నో!! అర్థం చేసుకునేందుకు మెదడుతోపాటు ఆస్వాదించే మనసుండాలేగాని సత్యోపదేశ జలధారలు ఎన్నో, అమృత కలశాలెన్నో!!

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"నమ్మేవారికి భూమిలో పలు నిదర్శనాలు న్నాయి. స్వయంగా మీ ఆత్మలలో (అస్థిత్వం లో) కూడా (ఎన్నో నిదర్శనాలు) ఉన్నాయి. మరి మీరు పరిశీలనగా చూడటం లేదా?".** (జారియాత్: 20, 21)

నేడు అన్ని రంగాల్లోనూ విజయ కేతనాన్ని ఎగుర వేస్తున్న మానవుడు, శాస్త్రవేత్తగా, ఆర్థికవేత్తగా సన్మానాలు అందుకుంటున్న మానవుడు నిజ దైవాన్ని తెలుసుకోలేక పోతున్నాడు. కారణం-పదార్థ పూజ, తన మేధ చెప్పింది, తన ఇంద్రియ పరిధిలోకి వచ్చింది మాత్రమే నిజం, తక్కినవన్నీ మిథ్య అన్న అహం. ఫలితం-ఆమ్ ఆద్మీ, సామాన్య మనిషి నిజ దైవాన్ని గుర్తించగలుగుతున్నా- డిగ్రీలు, పట్టాలు పుచ్చుకున్న అనేక మంది మాత్రం ఈ భాగ్యానికి దూరంగా జీవిస్తున్నారు. ఆ విషయానికొస్తే - తమలోని మహత్తు గొప్పదని ఎంచి, తన సత్తాకు తానే మత్తెక్కి, కళ్ళు పైకెక్కి, ఎత్తలేని బరువునెత్తి, కించిత్తైనా కదపలేక విసుగెత్తి, ఎత్తైన శిఖరాల నుండి పడి చిత్తైన ప్రముఖులు మానవ చరిత్రనేత్తి చూస్తే చాలా మంది ఉన్నారు. ఒక ఫిరౌను, ఒక హామాను, ఒక నమ్రూదు, ఒక అబూ జహల్, అబూ లహబ్ ఇలా ఎందరో నాయకులు, అధినాయకులు పత్తా లేకుండా అపకీర్తిని మూట గట్టుకొని మరీ పోయారు.

'అడగనిదే అమ్మ కూడా పెట్టదు' అన్నట్టు మనిషిలో సత్యార్తి లేనిదే అల్లాహ్ కూడా అతనికి సన్మార్గం చూపడు. ఆయన ఇలా సెలవిస్తున్నాడు: **"ఏ జాతి అయినా సరే స్వయంగా తన మనోమయ స్థితిని మార్చు కోనంత వరకూ అల్లాహ్ కూడా దాని స్థితిని మార్చడు".** (రాద్: 11)

ఏ సూర్యచంద్రనక్షత్రాల పరిశోధనతో నేటి మానవ ప్రగతి అంబర అంచుల్ని తాకుతు న్నదో, ఒకప్పుడు అవే సూర్యచంద్ర నక్షత్రాలను చూసి వాటిని రూపకల్పన చేసిన అల్లాహ్‌ను కనుగొన్నారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). జ్ఞానోదయం అనంతరం ఆయన ఇలా ప్రక టించారు:

"ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌కు మీరు కల్పించే భాగస్వాములతో నేను విసుగెత్తి పోయాను. వాటితో నాకెలాంటి సంబంధం లేదు". (అన్ఆమ్: 79)

"నిశ్చయంగా నేను ఆకాశాలను, భూమిని సృష్టించిన ఆ సృజనశీలుని వైపుకు ఏకాగ్రత తో నా ముఖాన్ని తిప్పుకుంటున్నాను. నేను షిర్క్ (బహుదైవారాధన) చేసేవారిలోని వాణ్ణి మాత్రం కాను". (అన్ఆమ్: 79)

వెలిగే చంద్రం దైవం కాదు, మండే సూర్యం దైవం కాదు, మెరిసే తారకం దైవం కాదు, ఎగసి పడే సంద్రం దైవం కాదు, పారే జలం దైవం కాదు, వెలిగే దీపం దైవం కాదు. వాటన్నింటిని పుట్టించిన వాడు - ఆయనే నిజ దైవం. ఆయనే అల్లాహ్.

రాత్రి, పగలు, సూర్యుడు, చంద్రుడు (వగైరా ప్రకృతి శక్తులన్నీ) అల్లాహ్ (ఏకత్వా నికి, ఆయన శక్తిసామర్థ్యాలకు) నిదర్శనాలే. (కనుక ప్రజలారా!) సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. మీరు నిజంగా దేవుణ్ని ఆరాధించేవారయితే, వాటిని సృష్టించిన అల్లాహ్ కే సాష్టాంగ పడండి. ప్రవక్తా! వీరు గనక తలబిరుసుతో మొండిగా వ్యవహరిస్తే వ్యవహరించనీ. నీ ప్రభువు సన్నిధిలో ఉన్న దైవదూతలు రేయింబవళ్ళు ఆయన్ని స్మరిస్తూనే ఉన్నారు. వారా స్మరణలో ఎన్నటికీ అలసిపోరు. (ఫుస్సిలత్ : 37-38)

3) అకుంఠిత దీక్ష, అవిరళ కృషి ఉంటే సమాజంలో మార్పు సాధ్యమే

సంఘ సంస్కరణా రంగానికి మూల పురుషులు ప్రవక్తలు. అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు, దౌష్ట్యాలు, దౌర్జన్యాలు, దుర్మార్గా లపై తిరుగుబాటు ప్రకటించిన ఆద్యులు ప్రవక్తలు. మయా మబ్బులు క్రమ్మి మార్గం కానరాక అయోమయ స్థితిలో పడి కొట్టుమిట్టాడే జనవాహినికి సత్య వెలుగుల్ని ప్రసాదించిన కాంతికారులు, క్రాంతి వీరులు, శాంతి రూపులు ప్రవక్తలు. సృష్టితాల దాస్య శృంఖలాలను త్రెంచి, అనవసర ఆంక్షల బరువులను మానవ భుజాల మీద నుండి దించి, సృష్టికర్తను ఆరాధించమని పిలుపు ఇచ్చిన ఆ పుణ్య పురుషుల, పరమ శ్రేయోభిలాషుల, మానవ మహోపకారుల సంఖ్య 1 లక్ష 24 వేల మంది కాగ, వారిలో 315 మంది రసూల్ (దైవ దౌత్యంతోపాటు ధర్మ శాసనం అనుగ్రహించబడిన ప్రవక్తలు) అవగా, వారిలో 5 మంది వజ్ర సంకల్పం గల ప్రవక్తలు.

4) వజ్ర సంకల్పం గల ప్రవక్తలు ఏం చేశారు ?

1) ప్రవక్త నూహ్ (అ) – తన జాతి వారిని 950 సంవత్సరాలు సత్యధర్మం వైపు పిలు స్తూనే ఉన్నారు.

2) ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) – ఎన్ని అడ్డంకులు ఎదురయినా, ఎన్ని ప్రతికూల పవనాలు వీచినా, భగభగమండే నిప్పుల్లో నెట్టేసినా, ఊరి నుండి గెంటేసినా ఆయన మాత్రం ప్రజల మేలు కోరుతూ అల్లాహ్ మార్గం వైపు వారిని ఆహ్వానిస్తూనే ఉన్నారు.

3) ప్రవక్త మూసా (అ)-అగ్రవర్ణం అని చెప్పుకుని బీరాలు పోయే ఖిబ్తీలు, కృషి వలుల్ని, శ్రమజీవుల్ని బానిసలుగా చేసే నిరంకుశ పాల నాధికారులపై యుద్ధాన్ని ప్రకటించిన ధీరోదాత్తులు. గోవును కాదు, గోవును పుట్టించిన అల్లాహ్‌ను ఆరాధించమని జాతికి హితోపదేశం చేసిన శాంత రూపులు ఆయన.

4) ప్రవక్త ఈసా (అ) – ప్రజలు ఆయన్ను హింసించినా, చెరసాల్లో బంధించినా, ముళ్ళ కిరీటం తొడిగించి వేధించినా, బాధించినా, పారదర్శకతే ప్రధానంగా భావించి వారిని అల్లాహ్ మార్గంలో నడిపించేందుకు పట్టు వీడని విక్రమార్కునిలా పరిశ్రమించారు.

5) అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) – గత ప్రవక్తలందరి కాలాల్లో ఉన్న దౌర్జన్యా లన్నీ ఆయన ఒక్కరి హయాంలోనే ఉన్నా విసుగు చెందక ఎంతో ఓర్పుతో, నేర్పుతో ప్రజల్లో సత్య చైతన్యాన్ని తీసకు వచ్చి, మానవ చరిత్రే కని, విని, ఎరుగని గొప్ప ఆదర్శ సమాజాన్ని స్థాపించి ప్రవక్తలందరిలో అగ్రజులుగా ఖ్యాతి పొందారు.

సోదరులారా! ఈ దారి మన కోసం అపరి చితమైనది కాదు. ప్రవక్తలందరూ, పుణ్య పురుషులందరూ నడిచిన దారియే. ఇది ఎంత సనాతనమో అంతే వినూతనం కూడా. కనుక చీకటి దట్టంగా ఉందే అని బాధ పడటం, భయ పడటం మాని ఒక్క చిరు దీపం వెలిగించేందుకు ప్రయత్నించండి. చీకటి దానంతట అదే తొలిగిపోతుంది.

మహనీయ ఇబ్రాహీం(అ), ఒక్క అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడు అనడానికి అత్యంత సమంజసమయిన కారణాలు వివ రించారు. అవును మానవుల్ని పుట్టించినవాడు అల్లాహ్‌యే... మానవుడు భువిలో కాలిడిన క్షణంలోనే తల్లి పాలిండ్లలో పాలును పుట్టించినవాడు, అతనికి పాలు చీకే మ్రింగే విధానాన్ని నేర్పినవాడు అల్లాహ్‌యే... మానవుల ఉనికి, పెరుగుదల, పెంపుదల, మనుగడ, ప్రగతీ వికాసాలకు కావలసినటువంటి సామాగ్రినంతటినీ సమకూర్చిన వాడు అల్లాహ్‌యే. ఇదే సత్యం. అలాంటప్పుడు

మహోన్నతుడయిన అల్లాహ్‌ను కాదని రాళ్ళతో, కొయ్యతో, బంగారు వెండిని కలిగించి చేసిన విగ్రహాలను పూజించడం, మానవుల మధ్య పుట్టి, పెరిగి, ఆపదలకు, రోగాలకు గురై స్వయంగా తమ మృత్యువును దాటలేక పోయిన వారిని ఆపదల్లో, అవసరాల్లో ఆశ్రయించడం కన్నా అవివేకం, అజ్ఞానం మరేది కాగలదు? సృష్టికర్త అయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. సృష్టితాలను కాదు.అల్లాహ్‌ను ఆరాధించడమే సహేతుకమయినది. సమంజసమయినదీను.

అల్లాహ్ ఇలా సెలవిస్తు న్నాడు: **"వజ్ర సంకల్పం గల ప్రవక్తలు సహనం వహించినట్లు నీవూ సహనం వహించు. వారి విషయంలో తొందర పెట్టకు".** (అహ్ఖాఫ్: 35)

ఈ జీవన పయనంలో విజయంతోపాటు వైఫల్యాలూ ఉన్నాయి. ఆశాసౌధాలతో పాటు ఆశాభంగాలూ ఉన్నాయి. కాని దారి తప్పిన ప్రతి సారి ప్రవక్తల జీవితాలు మనకు మార్గ దర్శకం కావాలి. ఖుర్‌ఆన్ మనకు వెలుగు బాటగా నిలవాలి. గమ్యం చేరుకోవాలన్న దీక్ష గల బాటసారి అలుపెరగడన్న వాస్తవం అర్థం చేసువాలి. ఈ కార్యసిద్ధికై దీక్ష, దుఆలతో పాటు అల్లాహ్‌పై ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. లక్ష్యం ఛేదించగలమనే ఆత్మ విశ్వాసంతోపాటు లోపాలను దిద్దుకునే గుణం అలవడాలి. సజ్జనుల సాంగత్యం కోసం ఆరాట పడాలి. నిత్యం శుభాత్మల్ని అన్వేషిస్తూ ఉం డాలి. అంతర్గత శక్తుల్ని సరిగ్గా అంచనా వేయగల్గటం, జ్ఞానాభివృద్ధి కోసం అవసరమైన మార్గాన్ని అవలంబించడం అనేవి తప్పనిసరి విషయాలు. ఈ మార్గంలో ప్రశంసల జల్లూ కురుస్తుంది. విమర్శల బురదా చల్లబడుతుంది. పొగడ్తకు పొంగి పోకూడదు – అది అహానికి దారి తీస్తుంది. విమర్శకు కృంగిపో కూడదు – అది మన శక్తియుక్తుల్ని నిర్వీర్యం చేస్తుంది. ఒకరి ప్రశ్నకు సమాధానంగా ఒక గొప్ప వ్యక్తి సమాధానం మనందరికీ కనువిప్పు కావాలి.

‘ఎవరైతే దైవ ధర్మం కోసం నన్ను ప్రేమిస్తున్నారో అల్లాహ్ వారికి మంచి ప్రతిఫలాన్ని అనుగ్రహించుగాక! దూషణలు, తిట్లు తిని నేను ముఖం చిట్లించుకోనప్పుడు తమరెందుకు అకారణంగా బాధ పడుతున్నట్లు!? నేను దూషణలు వింటాను, చదువుతాను; ఆ తర్వాత వాటిని ఓ ప్రక్కన పడేసి నా పని నేను చేసుకుపోతాను. మళ్ళీ అటుగా దృష్టి మరలించను. (నాకు పూర్తి నమ్మకం ఉంది.) అల్లాహ్ నాకిచ్చిన కీర్తిని ఎవరూ నా నుంచి వేరు పర్చ లేరు. అలాగే నాకు లేని ప్రతిష్టను ఎవరూ నాకు ఇవ్వజాలరు".

మరో సందర్భంగా ఆయన కార్యకర్తల్ని ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశారు:
"మీలోని ప్రతి ఒక్కరిలోనూ 'జ్వాల' అనేది ప్రజ్వలిస్తూనే ఉండాలి. అది- అనారోగ్యంతో విలవిల్లాడే మీ కుమారుణ్ణి చూసి వైద్యుని వద్దకు తీసుకెళ్ళేంత వరకూ మీ హృదయాలలో మండుతూ ఉండే ప్రేమాగ్ని జ్వాలలా – ఓ జ్వాల, ప్రజల్ని- వారి నిజ ప్రభువు సన్నిధికి చేర్చేంత వరకూ మీలో మండుతూనే ఉండాలి".

5) సంస్కరణోద్యమంలో యువకుల పాత్ర

యువకులైన ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) గారి మిథ్యా దైవాలపై తిరుగుబాటును ఆయన జాతి ప్రజలు పరస్పరం చర్చించుకోవడం గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటుంది: **"ఒక యువకుడు వాటి (విగ్రహాల) బలహీనతను ఎండ గడుతూ ఉండటం మేము విన్నాము. అతను ఇబ్రాహీమ్‌గా పిలువబడుతున్నాడు" అని కొందరు చెప్పారు;**

(అంబియా: 60)

పూర్వం దిఖియానోస్ అనే ఒక రాజు ఉండేవాడు. అతడు బహుదైవారాధన వైపు నకు, జాతరల వైపునకు ప్రజల్ని పురిగొల్పే వాడు. అయితే అదే రాజ్యంలో నివసించే సంపన్న వర్గాలకి చెందిన యువకులు కొందరు సత్యాన్వేషణ జరిపి సృష్టికికర్త ఒక్కడేనన్న విషయాన్ని గ్రహించారు. దాన్నే అమలు పర్చారు. చివరికి అప్పటి రాజు పిలిచి అడిగినా ధైర్యంగా సత్యాన్ని నిర్ధిష్టంగా వెల్లడించారు. వీరి గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు: **"తమ ప్రభువును విశ్వసించిన కొంత మంది యువ కులు వారు. మేము వారి సన్మార్గంలో వృద్ధి నొసగాము".** (అల్ కహఫ్: 13)
ఇలా చెప్పుకుపోతే- ప్రవక్త నూహ్ (అ), ప్రవక్త యూనుస్ (అ), ప్రవక్త షుఐబ్ (అ), ప్రవక్త మూసా (అ), ప్రవక్త ఈసా (అ), అంతిమై దైవ ప్రవక్త ముహమ్మద్ (స) – అందరూ యువకులే. వారి తర్వాత హజ్రత్ అబూ బకర్, ఉమర్, ఉస్మాన్, అలీ, హసన్, హుసైన్, ఖాలిద్ బిన్ వలీద్, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ మొదలగు వారందరూ యువకులే.

అదే విధంగా తారిఖ్ బిన్ జియాద్, ముహ మ్మద్ బిన్ ఖాసిమ్, సలాహుద్దీన్ అయ్యూబీ, ఇమామ్ ఇబ్ను తైమియా, ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్, షా వలీయుల్లాహ్ ముహ ద్దిస్ (ర), షా ఇస్మాయీల్ షహీద్ (ర), మౌలానా సనావుల్లాహ్ అమ్రుత్సరీ, మౌలానా అబుల్ ఆలా మౌదూదీ, సయ్యిద్ ఖుతుబ్ షహీద్ (ర) - వీరందరూ యువకులే. మానవ రాసికి చెందిన ఆణిముత్యాలు. ఒక్క మాటలో చెప్పాలంటే-ఏ జాతి యువకులు ప్రయోజకులై ఉంటారో ఆ

జాతి గతి సుగతి అవు తుంది. మరే జాతి యువకులు వ్యసనపరులై ఉంటారో ఆ జాతి గతి దుర్గతే. కాబట్టి ధర్మ ప్రచార బాధ్యత వృద్ధులకన్నా యువకుల మీదే ఎక్కువగా ఉంటుంది.

6) సత్యప్రియులు నిరాశ చెందరు

ధైర్యసాహసాల్ని నీరుగార్చే అంశాల నుండి కాల్పనిక ఊహల నుండి మనం దూరంగా ఉండాలి. ఇలాంటి ఆలోచనల్నిగానీ, ఆలోచనా పరుల సాంగత్యాన్ని గానీ మనం స్వీక రించకూడదు. ఆత్మ విశ్వాసం మనపై మనకు విశ్వాసం పెంచుతుంది. మనకేం కావాలో మనో ఫలకంపై చిత్రీకరించుకుని, మన గమ్యానికి చేరుకోవడానికి స్పష్టమైన మార్గాన్ని ఎన్నికోవాలి. ఎదురవ్వబోయే అడ్డకుంలను, అవరోధాలను, ప్రతి బంధకాలను ఎలా అధిగమించాలో ముందుగానే పథకాలు తయారు చేసుకోవాలి. అవసరమైన వనరులను, ప్రత్యామ్నాయ వ్యూహాలను కూడా సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత అంకిత భావంతో పురో గమిస్తే లక్ష్యాలను సులువుగా సాధించవచ్చు. మన ప్రేరణ మనమెంత దూరం ప్రయాణించామన్నది కాకుండా మనమింకా ఎంత దూరం ప్రయాణించాలన్నదై ఉండాలి. చూడండి! ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) తన జాతి ప్రజల కళ్ళు తెరిపించాలని ఓ పథకం ఏర్పాటు చేసుకున్నారు. తర్వాత ఎదురవ్వబోయే పరిణామాలను ముందుగానే అంచనా వేసుకున్నారు. **"ఓ ఇబ్రాహీమ్! మా దేవుళ్ళని అపహాస్యానికి పాల్జేసింది నువ్వేనా?"** అని జాతి జనులు నిలదీస్తే, 'నన్ను నిలదీసి ఏమిటి ప్రయోజనం? మీరు నా మాట ఎలాగూ నమ్మరు, తరతరాలుగా మీరు దైవాలుగా భావిస్తూ వస్తున్న ఆ విగ్రహాలనే అడగండి. ఒకవేళ వాటికి చెప్పే శక్తి ఉంటే వాటిపై జరిగిన అఘాయిత్యాన్ని అవే ఫిర్యాదు చేస్తాయి' అన్న ఆయన సమాధానం జాతి ప్రజల్ని ఆలోచనలో పడవేసింది.

తర్వాత షాక్ నుంచి తేరుకుని **'ఈ విగ్రహాలు పలుకలేవన్న సంగతి నీకూ తెలుసు కదా?'** అని ఎదురు ప్రశ్న వేశారు. అందుకు ఇబ్రాహీమ్ (అ) 'ఇదే నిజమైతే మరి మీరు అల్లాహ్‌ను వదలి మీకు ఏ మాత్రం లాభంగానీ, నష్టంగానీ కలిగించ లేని, స్వయానికే రక్షణ కల్పించుకోలేని వాటిని ఎందుకు పూజిస్తున్నారు? అల్లాహ్‌ను కాదని మీరు కొలిచే విగ్రహ ప్రతిమల పైన ఈగ వాలినా తోలుకలేని అశక్తులే అవి. మీకు ఈ పాటి ఇంగిత జ్ఞానం కూడా లేదా?' అని వారిని సూటిగా అడిగారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) హేతుబద్ధంగా ఇచ్చిన సమాధానం వాళ్ళను ఆలోచనలో పడవేసింది. వందల సంవత్సరాలుగా జడప్రాయంగా ఉన్న వారి బుద్ధి వివేకాల్లో ఒక్కసారి చలనం చోటు చేసుకుంది. అయినా అది మూడు నిమిషాల మార్పు గానే మిగిలింది. వారు సత్యాన్ని బాహాటంగా ఒప్పుకోవడానికి సాహసించలేక పోయారు.



7) ఇంట గెలిచి రచ్చ గెలువు

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) తనకు జ్ఞానోదయం అయిన మీదట ముందు తన ఇంటివారిని సత్యమార్గం వైపు ఆహ్వానించారు. **'నాన్నా! వినలేని, చూడలేని, మీకు ఏ మాత్రం ఉపయోగపడలేని వాటిని ఎందుకు పూజిస్తున్నారు? ఓ పితామహా! చూడండి మీ వద్దకు రాని జ్ఞానం నా వద్దకు వచ్చింది. (నేను సకల లోకాల ప్రభువును కనుగొన్నాను. సృష్టికర్త కాదని ఇతరత్రా సృష్టిరాసులను పూజించే, హారతులు పట్టే వారికి పట్టే దుర్గతి ఎంత ఘోరంగా ఉం టుందో నాకర్థమయింది.) కనుక మీరు నన్ను అనుసరించండి. నేను మీకు సరైన మార్గం వైపు దర్శకత్వం వహిస్తాను. ఓ తండ్రీ! మీరు షైతాన్ దాస్యాన్ని (మిథ్యను) విడనాడండి. ఓ తండ్రీ! మీరు ఎక్కడ కరు ణామయుని ఆగ్రహానికి గురవుతారోనని షైతాన్ సహవాసి అయిపోతారోనని నాకు భయంగా ఉంది' అన్నారు ఇబ్రాహీమ్..**

(మర్యమ్: 42-45)

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: **"నీ సమీప బంధు వులను హెచ్చరించు".** (షుఅరా: 214) ఈ ఆయతు అవతరించిన తర్వాత దైవ ప్రవక్త ముహమ్మద్ (స) తన బంధువుల్ని ఆహ్వానించి ఇలా అన్నారు: **"మీరు దైవ సన్నిధిలో మిమ్మల్ని రక్షించుకునే బందోబస్తు చేసుకోండి. అక్కడ నేను మీకు ఏ విధంగా నూ ఉపయోగపడలేను".**

(ముస్లిం)

అంటే, ఇతరులను సన్మార్గం వైపు పిలిచే ముందు దగ్గరి బంధువులను ఆ మార్గంలోకి తేవాలన్న భావం ఈ ఆయతుల్లో అంతర్లీనమై ఉంది.



8) విశ్వాసాన్ని బట్టి పరీక్ష

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: **"ప్రజలందరిలోకెల్లా అత్యంత తీవ్రతరమైన పరీక్షకు గురిచేయబడేవారు ప్రవక్తలు. ఆ తర్వాత విశ్వాసంలో వారిని పోలినవారు, ఆ తర్వాత వారిని పోలినవారు".** (సహీహ్ అల్ జామె)

అల్లాహ్ ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)ను తండ్రి ద్వారా, సమాజం ద్వారా, రాజ ద్వారా, అగ్ని ద్వారా పరీక్షించాడు. చివరికి పాలు త్రాగే పసికందుని నిర్జన ప్రదేశంలో వదిలేసి రమ్మని చెప్పినా, ఎన్నో ఏళ్ళకు తనకు కలిగిన ఒకే ఒక్క సంతాన్ని సయితం జిబహ్ చేయమని ఆదేశించినా ఆయన తడబడ లేదు. వెనకడుగు వేయలేదు. ఇదే విష యాన్ని ఖుర్ఆన్ ఇలా పేర్కొంటుంది: **"ఇబ్రాహీమ్‌ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ (నికా ర్సుగా) నెగ్గుకు వచ్చాడు".** (బఖర: 124)

9) హిజ్రత్ ప్రవక్తల సంప్రదాయం

పరిస్థితులు అనుకూలించనప్పుడు దాదాపు ప్రవక్తలందరూ దైవాదేశం మేరకు హిజ్రత్ చేశారు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఇరాక్‌లోని 'ఉర్' ప్రాంతం నుండి, షామ్ దేశానికి, ఆ తర్వాత హిరాన్ ప్రాంతానికి, ఆనక ఫలస్తీనా భూభాగానికి హిజ్రత్ చేసి వెళ్ళారు. దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు:

"నిశ్చ యంగా కర్మలు సంకల్పాలపై ఆధార పడి ఉంటాయి. ఎవరైతే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వైపునకు హిజ్రత్ చేస్తారో వారి ఉద్దేశ్యాన్ని బట్టే వారి కర్మ సిద్ధిస్తుంది. స్త్రీని మనువాడేందుకు, వ్యాపారం నిమిత్తం ప్రాపంచిక ఇతర ప్రయోజనాల దృష్ట్యా ఎవరు హిజ్రత్ చేస్తారో వారు కోరిందే వారికి దక్కుతుంది". (బుఖారీ)



10) ఇస్లాం వ్యవస్థాపకులు ముహమ్మద్ (స) కాదు

చాలా మంది ముస్లిమేతర పండితులు, చరిత్రకారులు ముస్లింలను ముహ్మదీయులు గా, ఇస్లాంను ముహమ్మదీయ మతంగా అభివర్ణిస్తుంటారు. ఇది నిరాధారమైన నిందారో పణ, మరియు ఇస్లాం ప్రవాహ శక్తి అడ్డు కునే కుయుక్తి తప్ప మరేమీ కాదు. నిశితం గా ఖుర్ఆన్ అధ్యయనం చేసే ప్రతి ఒక్కరికి ఈ విషయం అవలీలగా అర్థమై పోతుంది. హజ్ క్రియల్నే తీసుకుందాం. తవాఫ్, ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వారి జీవితం తో ముడిపడి ఉన్న అంశం. ఖుర్బానీ కూడా ఇబ్రాహీమ్ (అ) గారి జీవితంలోని మమేకాంశమే. సఫామర్వాల మధ్య సఫా హజ్రత్ హాజిరా (అ) గారి నిరుపమాన విశ్వాస జ్ఞాపకార్థం చేసే ఆచరణే. దీని బట్టి అర్థమయ్యేదేమి టంటే, ఇస్లాం ఒక్క ముహమ్మద్ (స) వారి మతం కాదు, అది ప్రవక్తలందరి జీవన ధర్మం. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవత రింపజేయబడిన దాని (ఖుర్ఆన్)నీ, ఇబ్రా హీమ్, ఇస్మాయీల్, ఇస్హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింప జేయ బడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారి లో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయులము – ముస్లింలము". (బఖర: 136)

"ఒకవేళ వారు (విశ్వ జనులందరూ) మీరు విశ్వసించినట్టే విశ్వసిస్తే, సన్మార్గం పొంద గలరు. విముఖత గనక చూపితే వారు అహంభావానికి, వైర భావానికి లోనై ఉన్నా రన్నది గమనార్హం". (బఖరా: 137)

ఇదే ప్రపంచ ప్రజలకు ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వారి జీవిత చరిత్ర ఇచ్చే సందేశం.





రచయిత ఒక చూపులో

పేరు సయ్యిద్ అబ్దుస్సలామ్. పుట్టింది తమిళనాడులోని అమ్మమ్మ ఊరైన వాలాజబాద్. పెరిగింది చిత్తూరు జిల్లాలోని కుగ్రామం నెరబైలు, పాత తురక పల్లి. ప్రాథమిక విద్య స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాల. పై చదువులు దారుస్సలామ్ కాలేజీ (ఉమరాబాద్)

ప్రస్తుతం ఉంటున్నది కువైట్ దేశంలో. రాసిన మొదటి వ్యాసం సమాజ ప్రాశస్త్యం - 2005 గీటురాయి మాస పత్రికలో. ప్రస్తుతం నెలవంక మాస పత్రిక ప్రధాన సంపాదకులు. ప్రచురితమైన పుస్తకాలు ముఖబందిత మధుకలశం, హజ్జ్ ఆదేశాలు. అనురాగ రావం. టెలికాస్ట్ అయినా ప్రోగ్రాములు KTV2, మెర్సీ మరియు స్ఫూర్తి చానల్స్ లో వివిధ అంశాల పై ధార్మిక ప్రసంగాలు.

ప్రవృత్తి: సత్యాన్వేషణ.